'తప్పని సరే! నువ్వు భోజనంచేయడం ఎంత తప్పని సరో, నిద్రించడం ఎంత తప్పని సరో, నీ పెళ్ళాన్ని కితకితలు పెట్టడం ఎంత తప్పని సరో ఇదీ అంత... రేపీపాటికి కుచ్చుపాగాతో సహా నువ్వు చెరువుగట్టు మీద హాజరుగా వుండాలి—నేను నీకు పూలదండ వేస్తాను—'

'మహాప్రసాదం! ప్రభువుల ఆజ్ఞ అంతే అయితే—'

'ఇక మాట్లాడకు—అంతే!'

'అయితే వెంటనే ఒక డజనుమంది గూండాలకు కబురు చేయిస్తాను...'

'ఎందుకూ?'

'భద్రపురం సంస్థానంలోని పరిస్థితులను ఇరవై నాలుగు గంటలలోగా—అంటే, రేపు నా ఉపన్యాసం ప్రారంభమయ్యేలోగా—మన సంస్థానంలోకూడా ప్రవేశపెట్టడానికి......'

## శిలాశాసనం

'శేషయ్యా?'

'ప్రభూ!'

'ఈ పేపర్లోపడ్డ ఫొటో చూడూ—ఎవరీ సుందరి?'

'ప్రసిద్ధ సినీమాతారండి—ఆమెది బొంబాయి—'

'మన సంస్థానంలోకూడా ఇలాంటి వాళ్లెవళ్లైనా వున్నారా?'

'ఇంకా అందమైన వాళ్ళే వున్నారండి—'

'ఈవిడకి మల్లే ఫిలిములలో నటిస్తారా వాళ్లు?'

'నటించరండి - ఫిలిములలో నటించడమంటే ఏమిటో వారికి తెలీదు—కాని, ఈవిడకన్నా అందమైనవాళ్లు మాత్రం వున్నారండి—'

'ఏం ప్రయోజనం? ఫిలిములలో నటించనితర్వాత ఎంత అందముంటేనేం? కొరుక్కు తింటామా ఆ అందాన్ని?'

'చిత్తం! నిజమేనండి—'

'ఫిలిములలో నటించరట! ఎందుచేతనోయి శేషయ్యా?'

'వారికి తెలీదండి ఆ విద్య-మన సంస్థానంలో ఫిలిం పరిశ్రమ లేదు-'

'ఎంతఘోరం! ఎంతమంది అందగత్తెలు ఫిలిములలో నటించకండా నీళ్లు కారిపోతున్నారు?'

'చిత్తం! తమరే ఇలా విచారిస్తున్నారండి-వాళ్లు విచారించడంలేదు-వాళ్ల సంసార సుఖాలతో వాళ్లు తృప్తిపడి వున్నారండి.'

'శేషయ్యా? ఇది నిజంగా విచారకరమైన సంగతి. మన ఆడవాళ్ళు ఇంత వెనకబడి వున్నారని నాకు తెలీదు-'

'చిత్తం! విచారకరమేనండి!'

'ఇంతవరకూ నువ్వీ విషయం నాకు తెలియజేయక పోవడం-'

'పొరబాటేనండి!'

'శేషయ్యా!'

'వెంటనే మన సంస్థానమంతా ఫిలిం పరిశ్రమకు పూనుకోవాలి-'

'ఇప్పుడేనాండీ?'

'సాక్షాత్తూ ఇప్పుడే! నువ్వు వెళ్ళి యాక్టర్లని బుక్ చెయ్యి-'

'నేనాండీ?'

'నువ్వేనండి-ఫో-మరి మాటాడకు-'

'నాకు గుండె దడొస్తూందండి-'

'ఫరవా లేదు-చూడూ, డైరక్టరుగా ఎవర్ని వేద్దాం?'

'మన సంస్థానంలో ఆ విద్యగలవారెవరూ లేరండి—'

'అయితే నువ్వే అన్నిటికీ తగినవాడివి—నిన్ను డైరక్టర్ని చేశా-'

'ప్రభూ! ఇంత దారుణం కూడదు-ఈ శిలాశాసనం—'

'ఏం?'

'డైరక్టరుగా వుండటమంటే నాకేమీ తెలీదు-నా మంత్రి వుద్యోగాన్ని ప్రశాంతంగా నిర్వహించ నివ్వరులా వుంది—'

'ఫరవా లేదు-ఈ వుద్యోగం ఆ ఉద్యోగంకూడా నువ్వే చేద్దువుగాని—'

'అసలు నాకు ఆ ఫిలిం డైరక్టరు పనంటే ఏమిటో సుతరామూ తెలీదండి—'

'ఎవరికీ తెలీదు—ముందుగా— నేర్చుకుందువు గాని—'

'ఈ వృద్ధుణ్ణి ఇలా ప్రశాంతంగా బ్రతకనివ్వరూ ?'

'శేషయ్యా ! నీ ప్రశాంతి కేమీ భంగంరాదు- వెళ్ళు—'

'నా బ్రతుకు తమ బుర్రలో వుంది - ఏం చేస్తారో ?'

'భయంలేదు-చూడూ, మనం తియ్యబోయే ఫిలిముకు ఈ పేపర్లో పడ్డ నటీమణిలాంటి మనిషి కావాలి- -'

'చిత్తం !'

'ఎక్కడ దొరుకుతారూ ఇలాంటి వాళ్లూ ?'

'వాకబు చెయ్యాలండి—'

'ఎందుకోయి ఈమాత్రం దానికీ ? మన సంస్థానంలో పేరుపడ్డ అందగత్తెలు— ఈ బొమ్మలో మనిషిలాంటివారు—ఎవరున్నారో నీకు తెలీదు ?'

'నాకెలా తెలుస్తుందండీ— అయినా అందమైన ఆడవాళ్లుండగానే సరిగాదండి—వాళ్లు ఫిలిములలోకి వచ్చి నటించడానికి ఇష్టపడొద్దూ ?'

'చచ్చినట్టు ఇష్టపడతారు-కోరుక్కు తినేస్తామా వాళ్లనీ? వొస్తారు, కాస్త నటించి, నాలుగు పాటలుపాడి మనం ఇచ్చింది పుచ్చుకుని వెడతారు—ఇందులో తగనిపని ఏముందీ ?

'ఏమీ లేదండి—కాని, వారికి ఈ సంగతలు అర్థం కావొద్దండీ ?'

'అర్థమయ్యేట్టుగా మనం చెప్పాలి—ముందు అందమైన ఆడవాళ్లు ఎక్కడున్నారో—కాస్త ఆలోచించి చెప్పు—'

'నాకెలా తెలుస్తుందండీ ?'

'వినికిడివల్ల ఆమాత్రం తెలీదుటోయ్ ఎవరు అందమైన వారయిందీనూ ?'

'అక్కడక్కడ ఒకరిద్దరు అందగత్తె లుండవచ్చునండి.'

'ఆ ముక్క నువ్వు చెప్పేదేమిటీ? వారెవరని?'

'ప్రసిద్ధిగాంచిన అందంగలవాళ్లు ఒకరిద్దరికంటే వుండరండి, మన సంస్థానంలో—'

'ఒకరిద్దరే మనకు కావలసింది. మందలను తోలుకొచ్చి మనమేం చేసుకుంటాం?'

'నిజమేనండి-'

'ఆ ఒకరిద్దరిలోనూ ఎవరైనా తెలుసునా నీకూ?'

'చిత్తం! తెలుసునండి-'

'ఆమె భర్త ఆమె ఫిలిం రంగంలో ప్రవేశించడానికి అంగీకరించే వాడేనా?'

'చిత్తం! తప్పకుండా అంగీకరిస్తాడండి. ఆమెను ముందు మనం బుక్ చేస్తే అనేకనుంది ఆమెను అనుసరిస్తారు-'

'తప్పకుండా బుక్ చేద్దాం వెంటనే వెళ్లి-ఎవరావిడా? చాలా బాగుంటుందా-ఈ పేపర్లో తారాణికి మల్లే?'

'చిత్తం! అంతకన్న బాగావుంటుదం డామె-ఆమె భర్తకూడా ఫిలింపరిశ్రమ అంటే చెవి కోసుకుంటాడు-'

'శేషయ్యా! ఇంక కబుర్లతో కాలం వృధా చెయ్యకూడదు—ఎవరో చెప్పు వెడదాం-'

'చిత్తం! మనం ఎక్కడకూ వెళ్ళ నక్కర్లేదండి. ఇక్కడనే-శమ అంతఃపురంలోనే వున్నారండి.'

'శేషయ్యా? ఏమిటోయి, ఎవరిమాట నువ్వు అంటూంట!'

'చిత్తం! ఇంకెవరండి! శ్రీ రాణిగారు!—'

—